ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 28.04.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై విచారణ కోసం సీబీఐకి లేఖ రాయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అవసరమైతే మంత్రులు స్వయంగా సీబీఐ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేయాలని ఆదేశించారు.
2. చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద అప్రోచ్ రోడ్లను విస్తరించాలని, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి, విస్తరణపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు.
3. తెలంగాణలో ఇంధన కొరతపై సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మవద్దని, రాష్ట్రంలో తగినంత నిల్వలు ఉన్నాయని పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర తెలిపారు
4. విశాఖ తర్లువాడలో 'గూగుల్ ఏఐ డేటా హబ్' నిర్మాణానికి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్, శంకుస్థాపన చేశారు.
5. తెలంగాణలో రానున్న మూడు రోజుల్లో ఎండలు మరింత తీవ్రమౌతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉత్తర తెలంగాణలో వడగాలులు వీచే ప్రమాదం ఉందని తెలిపింది.

----------------------------

**కాళేశ్వరం**

కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై సీబీఐ విచారణ కోసం ఒత్తిడి పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ అంశంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, న్యాయ నిపుణుడు అభిషేక్ సింఘ్వీతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రస్తుతం

ఏ కోర్టులోనూ కేసులు పెండింగ్‌లో లేనందున సీబీఐ దర్యాప్తునకు చట్టపరమైన అడ్డంకులు లేవని నిపుణులు స్పష్టం చేశారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదిక కూడా చెల్లుబాటులోనే ఉందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో తక్షణమే విచారణ చేపట్టాలని కోరుతూ సీబీఐకి లేఖ రాయాలని, అవసరమైతే మంత్రులు స్వయంగా సీబీఐ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పలువురు మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొని తదుపరి కార్యాచరణపై చర్చించారు.

డెస్క్

-----------------------------------

**జి. కిషన్ రెడ్డి**

చర్లపల్లి, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ల అభివృద్ధి, రోడ్ల విస్తరణపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. చర్లపల్లి నూతన టెర్మినల్‌కు ప్రయాణికుల తాకిడి పెరిగినందున FCL గోడౌన్, భరత్ నగర్, ఈసీ నగర్ వైపు నుండి అప్రోచ్ రోడ్లను కనీసం 100 నుంచి 200 అడుగుల మేర విస్తరించాలని కోరారు. పార్కింగ్ కోసం అదనపు భూమి కేటాయింపుతో పాటు నీటి సరఫరా పనులను వేగవంతం చేయాలని విన్నవించారు. అలాగే సికింద్రాబాద్ స్టేషన్ పునరాభివృద్ధి నేపథ్యంలో ఆల్ఫా హోటల్ నుండి రైతిఫైల్ బస్టాండ్ వరకు రోడ్డును 120 అడుగులకు పెంచాలని సూచించారు. గతంలోనే విన్నవించినా పనులు ప్రారంభం కాలేదని, కాబట్టి ముఖ్యమంత్రి వ్యక్తిగతంగా చొరవ తీసుకుని ఈ కీలక మౌలిక సదుపాయాల కల్పనకు తక్షణమే భూసేకరణ, నిధుల విడుదల చేయాలని కిషన్ రెడ్డి లేఖలో కోరారు.

డెస్క్

-----------------------

**రేవంత్ రెడ్డి**

హైదరాబాద్ ఐసీసీసీలో మహిళలు, పిల్లల భద్రతే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'స్పందన' టీమ్స్ ను ప్రారంభించి, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, డీజీపీ శివధర్ రెడ్డి, సీపీ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి

మాట్లాడుతూ... మహిళా భద్రత ఉన్న చోటే అభివృద్ధి వేగంగా జరుగుతుందని, వారి రక్షణ కోసం తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. మహిళా సాధికారిత కోసం ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, బ్యాంక్ రుణాలు, పాఠశాలల నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకే అప్పగించినట్లు వివరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని, అందుకు మహిళలు ఆర్థికంగా ఎదగడం, యువత వ్యసనాల బారిన పడకుండా ఉండటం కీలకమని సీఎం స్పష్టం చేశారు.

**డెస్క్**

-----------------------

**ఖమ్మం జిల్లా కలెక్టర్**

ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వేగంగా అందించడమే తమ ప్రథమ ప్రాధాన్యమని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతామన్నారు. జనగణనలో భాగంగా మే 10 వరకు స్వీయ నమోదుకు అవకాశం ఉందని, 2027 ఫిబ్రవరిలో క్షేత్రస్థాయి గణన జరుగుతుందని వివరించారు.

**బైట్ ... దివాకర్ టిఎస్, ఖమ్మం కలెక్టర్**

అలాగే, జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరా సమస్య రెండు రోజుల్లో సర్దుకుంటుందని, 110 ట్యాంకర్లు వస్తున్నాయని పేర్కొన్నారు.

**పిటిసి, ఖమ్మం**

----------------------

**స్టీఫెన్ రవీంద్ర**

తెలంగాణలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది. ఇంధన కొరతపై సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మవద్దని, రాష్ట్రంలో తగినంత నిల్వలు ఉన్నాయని కమిషనర్

ఎం. స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. చమురు సంస్థలతో సమన్వయం చేసుకుంటూ నిరంతర

సరఫరాను పర్యవేక్షిస్తున్నామని, నిన్న రాష్ట్ర వ్యాప్తంగా రికార్డు స్థాయిలో 11 వేల 490 కిలోలీటర్ల పెట్రోల్, 18 వేల 449 కిలోలీటర్ల డీజిల్ కలిపి మొత్తం 29 వేల 939 కిలోలీటర్ల ఇంధనాన్ని సరఫరా చేసినట్లు వివరించారు. ప్రజలు ఆందోళన చెంది అనవసరంగా నిల్వ చేయవద్దని, ఇది ప్రమాదకరమని హెచ్చరించారు. కృత్రిమ కొరత సృష్టించినా లేదా పుకార్లు వ్యాప్తి చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది.

**డెస్క్**

--------------------------

**నల్లగొండ కలెక్టర్ చమురు నిల్వలు**

నల్లగొండ జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, కొరత ఉందన్న ప్రచారంలో వాస్తవం లేదని కలెక్టర్ బి. చంద్రశేఖర్ స్పష్టం చేశారు. అధికారులు, డీలర్లతో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు భయాందోళనతో అదనపు నిల్వలు కొనుగోలు చేయవద్దని కోరారు. ముఖ్యంగా వరి కోతలు, హార్వెస్టర్లకు ఇంధన సరఫరాలో ప్రాధాన్యత ఇవ్వాలని, బంకుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ 'నో స్టాక్' బోర్డులు పెట్టకూడదని ఆదేశించారు. క్యాన్లలో విక్రయాలు నిషేధించామని, నిబంధనలు ఉల్లంఘించి కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారిని నియమించడంతో పాటు సరిహద్దు చెక్‌పోస్టులను కూడా అప్రమత్తం చేశారు.

**పిటిసి, నల్గొండ**

-------------------------

**ధర్మపురి**

ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈరోజు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అధికారులతో కలిసి మాస్టర్ ప్లాన్ అమలుపై సమీక్షించారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు

పేర్కొన్నారు. భద్రాచలం, కాళేశ్వరం తరహాలోనే ధర్మపురిని కూడా సమగ్రంగా అభివృద్ధి చేసి, టెంపుల్ సిటీగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు.

**బైట్ – అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**పీటీసీ - జగిత్యాల**

---------------------------

**గూగుల్ ఏఐ డేటా హబ్ శంకుస్థాపన**

విశాఖపట్నంలో గూగుల్ సంస్థ ఏర్పాటు చేయనున్న గూగుల్ ఏఐ డేటా హబ్ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈరోజు శంకుస్థాపన చేశారు. దాదాపు 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో గూగుల్ ఈ ప్రాజెక్టును చేపడుతోంది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ... గూగుల్ వంటి పెద్ద సంస్థలు విశాఖకు రావడం శుభపరిణామమని, కేంద్రం నుంచి సహకారం అందించడంలో వెనకడుగు వేయబోమని స్పష్టం చేశారు.

**బైట్ ... అశ్విని వైష్ణవ్**

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, రామ్మోహన్ నాయుడు, మంత్రి లోకేశ్, తదితరులు పాల్గొన్నారు.

**డెస్క్**

---------------------------

**ఆసిఫాబాద్ ఎండలు**

ఆసిఫాబాద్ జిల్లాలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. జిల్లాలోని 15 మండలాల్లో ఐదు మండలాలకు అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ముఖ్యంగా ఆసిఫాబాద్ మండలంలో గరిష్ఠంగా 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, మిగిలిన అన్ని మండలాల్లో 44 డిగ్రీల కంటే ఎక్కువే నమోదవుతోంది. ఉదయం 9 గంటల నుంచే సూర్యుడి ప్రతాపం ఎక్కువగా ఉండటంతో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయాల్లో బయటకు

రాకూడదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఎండల నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**పిటిసి, ఆసిఫాబాద్**

---------------------------

**క్రేస్ ప్రమాదం**

హైదరాబాద్ శివారు శంకరపల్లిలోని ఎన్సీసీ వర్క్ షాప్‌లో నిన్న సాయంత్రం చోటుచేసుకున్న క్రేన్ ప్రమాదంలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కారణంగా రెండు భారీ క్రేన్లు కుప్పకూలడంతో తొలుత ముగ్గురు మరణించగా, సహాయక చర్యల అనంతరం మరో ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. ఈ ప్రమాదంలో ఐదుగురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు.

**పీటీసీ - హైదరాబాద్**

----------------------------